
కొత్తగూడెంలో రోడ్డు పక్కన ప్రమిదలు, బొమ్మల దుకాణాలు


పాల్వంచరూరల్: వివిధ డిజైన్లలో మట్టి ప్రమిదలు


బాణాసంచా దుకాణం

దీపావళి సందడి..

- మార్కెట్‌లో ఆకట్టుకుంటున్న వివిధ డిజైన్లలో ప్రమిదలు
- ప్రత్యేకంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు

కొత్తగూడెంటౌన్/పాల్వంచరూరల్: దీపావళి పండగకు ఇంటింటా దీపాలు వెలిగిస్తారు. ఈ వెలుగులతో ప్రతీ ఇల్లూ శోభిల్లుతుంది. దీపావళికి ప్రత్యేక అకర్షణగా నిలిచేవి ప్రమిదలు. పండుగకు మట్టి ప్రమిదలను వెలిగించడం సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ ప్రమిదలను కొనుగోలు చేసేందుకు మహిళలు అసక్తి చూపుతారు. మార్కెట్‌లో వివిధ రూపాల్లో ఉన్న ప్రమిదలను చిరువ్యాపారులు విక్రయిస్తున్నారు. ప్రతీ సంవత్సరం దీపావళి పండుగకు ముందు రాజస్తాన్, కోల్‌కతా, తమిళనాడు ప్రాంతాల నుంచి వివిధ రకాల మట్టి ప్రమిదలను దిగుమతి చేసుకుని పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలం తదితర పట్టణ ప్రాంతాల్లో డజన్ రూ.50 నుంచి 200 వరకు విక్రయిస్తున్నారు. పెద్దసైజువి అయితే ధరలు రూ.500 వరకు అమ్ముతున్నారు. అదేవిధంగా ఇంటి అలంకరణకు షాపుల్లో వివిధ రకాల విద్యుత్ దీపాలను విక్రయిస్తున్నారు.


టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో టపాసులు కాల్చుతున్న విద్యార్థులు

భగ్గుమంటున్న బాణాసంచా ధరలు...
దీపావళి పండగ సందర్భంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతీ, యువకులు, పెద్దలు, మహిళలు, చిన్నారులు కలిసి బాణాసంచా కాల్చుతూ సంబురాలు చేసుకుంటారు. ఈ ఏడాది బాణాసంచా ధరలు మార్కెట్‌లో భగ్గుమంటున్నాయి. గతేడాది కంటే ఐదు నుంచి పదిశాతం అధిక ధరలకు విక్రయిస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంబురాలు..
టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ముందస్తు దీపావళి నిర్వహించారు. విద్యార్థులందరూ క్రాకర్స్ కాల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎం జ్యోతిరాణి, టీచర్లు పద్మ, నీరజా షారోన్, లోగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరాకీ బాగుంది..



దీపావళి పండుగకు ప్రమిదలు, దేవుళ్ల బొమ్మలు కొనుగోలు చేసేందుకు అధిక సంఖ్యలో కొనుగోలుదారులు వస్తున్నారు. ఈ ఏడాది ప్రమిదలు, బొమ్మలకు గిరాకీ బాగుంది. ప్రమిదలు డజను రూ.40 నుంచి రూ.80, దేవుళ్ల బొమ్మలు సైజును బట్టి రూ.80– 200 వరకు అమ్ముతున్నాం.
–దుర్గా, షాపు యజమాని, రామవరం

దీపాలు సంప్రదాయం..



ప్రతీ సంవత్సరం దీపావళి రోజున ప్రమిదల్లో దీపాలను వెలిగించడం ఆనవాయితీగా వస్తుంది. గతంలో చిన్నచిన్న ప్రమిదల్లో మాత్రమే వెలిగించేవాళ్లం. కానీ మారుతున్న కాలంతోపాటు వివిధ డిజైన్లలో తయారుచేసి అమ్ముతున్నారు. వాటిని చూడగానే కొనాలనిపిస్తోంది. ప్రతి సంవత్సరం కొత్తగా వచ్చిన డిజైన్లను కొంటాను.
– పద్మ, పాల్వంచ

ఆర్‌ఎం దృష్టికి ఇల్లెందు డిపో సమస్యలు

'డయల్ యువర్ ఆర్‌ఎం'లో విన్నవించిన నేతలు

ఇల్లెందు: ఇల్లెందు ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటై రెండేళ్లు కావొస్తోంది. అయితే, తొలినాళ్లలో ఇతర డిపోల నుంచి కేటాయించిన పాత బస్సులు ప్రస్తుతం ఎప్పుడు, ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యాన ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం నిర్వహించిన 'డయల్ యువర్ ఆర్‌ఎం' కార్యక్రమానికి ఫోన్ చేసిన పలువురు ఇల్లెందు డిపో సమస్యలను విన్నవించారు. ఈ మేరకు ఆర్‌ఎం సరిరామ్ నాయక్‌కు ఫోన్ చేసిన బీఆర్‌ఎస్ నేత దిండిగల రాజేందర్ ఇల్లెందు డిపోలో పాత బస్సుల కారణంగా ఎదురవుతున్న సమస్యలు, బస్టాండ్‌లో తాగునీటి కొరతను వివరించడమే కాక భద్రాచలం, మణుగూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఏసీ బస్సులను ఇల్లెందు మీదుగా మళ్లించాలని కోరారు. అంతేకాక ఇల్లెందు డిపో నుంచి బస్సుల సంఖ్య పెంచాలని కోరగా ఆర్‌ఎం త్వరలోనే సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు రాజేందర్ తెలిపారు. ఇక ఇల్లెందులో బస్ డిపోలో డీజిల్ బంక్ లేకపోవడంతో రాకపోకల్లో జరుగుతున్న జాప్యం, బస్టాండ్‌లో మూతబడిన హోటల్ వివరాలు కూడా వెల్లడించారు. అలాగే, బస్టాండ్‌లోకి ప్రైవేట్ వాహనాలు రాకుండా కట్టడి చేయాలని, రెగ్యులర్ కంట్రోలర్, పూర్తి స్థాయి మేనేజర్‌ను నియమించాలని ఇల్లెందుకు చెందిన నాళ్ల సోమసుందర్ ఆర్‌ఎంను కోరారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించండి..

పాల్వంచరూరల్: రైతులు పండించిన అన్నిరకాల పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మాస్‌లైన్ పార్టీ అనుబంధ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిమ్మల రాంబాబు, వేల్పుల రమేష్, నకిరెకంటి నాగేశ్వరరావు, తాటి నాగరాజు, ఇర్ప సతీష్, కొర్స రాంబాబు, బొల్లం లింగయ్య, కోటయ్య, ఎల్లయ్య, వినోద్, లింగస్వామి, నాగయ్య, పద్మ పాల్గొన్నారు.
జూలూరుపాడు: పత్తి క్వింటాకు గిట్టుబాటు ధర రూ.12,000 కల్పించాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడులో జరిగిన గోర్ బంజారా పోరాట సమితి మండల కమిటీ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. సుజాతనగర్, జూలూరుపాడు, లక్ష్మీదేవీపల్లి మండల కేంద్రాల్లో ప్రైవేట్ వ్యక్తులు కౌంటర్లు ఏర్పాటు చేసి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో చరణ్ నాయక్, ప్రసాద్, గోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


పాల్వంచరూరల్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



క్లుప్తంగా

తప్పిపోయిన పిల్లల అప్పగింత..


పిల్లలు, తల్లిదండ్రులతో ట్రాఫిక్ పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: ఇంటి నుంచి బయటకు వచ్చి, తప్పిపోయిన పిల్లలను కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు వారి తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. పట్టణ పరిధి బూడిదగడ్డకు చెందిన నాలుగు, ఐదు సంవత్సరాలు ఉన్న ఉసిరి ప్రతీక్, కుంజా చరణ్ ఇంటి నుంచి బయటకు వచ్చి తప్పిపోయారు. సూపర్ బజార్‌లో తిరుగుతున్న పిల్లలను ట్రాఫిక్ పోలీసులు గుర్తించి వారి వివరాలను సేకరించారు. ట్రాఫిక్ ఎస్సై మదార్ ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

పనిప్రదేశాల్లో భద్రత కల్పించండి..

పాల్వంచ: మహిళా కార్మికులు, ఉద్యోగులు పనిచేసే స్థలాల్లో భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొని నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో ట్రైనీ నర్సులు, వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొని నాగేశ్వరరావు మాట్లాడుతూ... రెండు నెలల క్రితం కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో జరిగిన అభయ ఘటనపై దోషులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మంకెన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్ సందర్శన

ఇల్లెందు: మున్సిపల్ కౌన్సిలర్లు మోడల్ మార్కెట్‌ను సందర్శించి పరిశీలించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యంగా లలిత కళామందిర్ రహదారిలో నిర్మాణమైన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉందని, తక్షణమే కలెక్టర్ అనుమతి తీసుకుని గదులు కేటాయించాలని తీర్మానించారు.

ఫౌంటెన్ ప్రారంభం..


ఫౌంటెన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి పోస్టాఫీసు సెంటర్‌లోని సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఫౌంటెన్‌ను మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి మంగళవారం రాత్రి ప్రారంభించారు. రంగురంగుల లైట్లలో నీటిధారలు వచ్చిపోయేవారిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట డీఈ రవికుమార్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

ఇల్లెందు: దీపావళి పండుగ టపాసుల దుకాణదారులు తప్పని సరిగా నియమ నిబంధనలు పాటించాలని డీఎస్పీ ఎన్.చంద్రభాను సూచించారు. మంగళవారం తహసీల్దార్ రవికుమార్, సీఐ సత్యనారాయణ, ఫైర్ ఆఫీసర్ నవీన్‌లతో కలిసి దుకాణాలను సందర్శించి పరిశీలించారు. దుకాణ యజమానులతో మాట్లాడారు. నిబంధనలు పాటించాలని సూచించారు. షాపుకు షాపుకు మధ్య దూరం ఉండాలని, ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, నీరు, ఇసుక కచ్చితంగా ఉండి తీరాలన్నారు. పండుగ ముగిసే వరకు ఫైరింజన్ గ్రౌండ్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు.

చేయి తడిపితేనే...
దీపావళికి టపాసుల ధరలు చుక్కలను అంటుతున్నాయి. దీపావళీ కోసం టపాసుల షాపులు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి కావటంతో దాని పేర భారీగా నిధులు చేజారుతున్నాయి. మూడు, నాలుగు శాఖలు ఇందులో నిమగ్నం కావటంతో అన్ని శాఖల వద్ద చేతులు తడిపి అనుమతులు పొందుతున్నట్లు సమాచారం. ఇల్లెందు పట్టణంలో 38 టపాసుల దుకాణాలకు అనుమతులు పొందారు. వీరంతా దుకాణం ఏర్పాటు చేసే నాటికే ఒక్కో షాపుకు సుమారు రూ.40 వేల ఖర్చు అవుతోందని మదనపడుతున్నారు. దీంతో నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు.


దుకాణదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఉద్యమకారులను ఆదుకోవాలి

పాల్వంచరూరల్: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విద్యార్థి విభాగం ఉద్యమ నాయకుడు బుడగం రవికుమార్ మంగళవారం ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు కీలకపాత్ర పోషించారు. ఉద్యమ నాయకులను ప్రభుత్వం గుర్తించి ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, రెండువందల గజాల ఇంటి స్థలం, పెన్షన్లు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కుదిరిన కార్మికుల వేతన ఒప్పందం


ఒప్పంద పత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: బొగ్గు రవాణా కోసం సాగిన చర్చలు ఫలించాయి. మంగళవారం ఇల్లెందులోని ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో టీయూసీఐ, టిప్పర్ అసోసియేషన్, యాజమాన్యంతో జరిగిన ఓ కొలిక్కి వచ్చాయి. కార్మికుల రోజు వారీ వేతనాలు రూ.550 ఉండగా రూ.60 పెంచి రూ.610 అమలు చేసేలా ఒప్పందం జరిగింది. ఇతర అలవెన్సులు రూ.110 పెరిగాయి. కేటీసీ నుంచి ఇల్లెందుకు బొగ్గు రవాణా చేసేందుకు జరిగిన చర్చల్లో టిప్పర్ అసోసియేషన్ నుంచి కోరం సురేందర్, అధ్యక్షులు ఎన్.నర్సింహారావు, బాడీ లారీ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ మౌలానా, కార్యదర్శి వెంకట్, బాలకృష్ణ, రవి, మోహన్, టీయూసీఐ యూనియన్ పాయం వెంకన్న, యాకుబ్‌షావలీ పాల్గొన్నారు. మరో వర్గంలో యూనియన్ నేతలు టి. నాగేశ్వరరావు, సారంగపాణీ, ప్రసాద్, మల్లికార్జున్, మోహన్, రాసుద్దీన్, రామ్‌దాస్, దేవరకొండ శంకర్, యాకుబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం


వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

టేకులపల్లి: ప్రపంచానికి మొట్టమొదటిగా ఆయుర్వేదాన్ని, ప్రాచీన వైద్య విధానాన్ని అందించిన వైద్యుడు ధన్వంతరి జయంతి సందర్భంగా మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని సులానగర్ పీహెచ్‌సీలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం ఆయుష్ వైద్యాధికారి, సిబ్బంది ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ధన్వంతరి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయుష్ వైద్యురాలు గడిపల్లి విజయశ్రీ , సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి ఆయుర్వేద మందులను అందజేశారు. డాక్టర్ విజయశ్రీ మాట్లాడుతూ... ఆయుర్వేద వైద్య విధాన గొప్పతనం గురించి వివరించారు. ఐదు వేల సంవత్సరాల కంటే ముందే కనుగొన్న ఈ ఆయుర్వేద వైద్య విధానం భారతీయుల అమూల్యమైన సొత్తు అన్నారు. భారతదేశ సంప్రదాయ వైద్య విధానాలైన ఆయుర్వేదం , పంచకర్మ, యోగా, ధ్యానం, మసాజ్ ఆక్యూపంచర్‌పై ప్రతీఒక్కరు అవగాహన పెంచుకొని ఈ వైద్య విధానాన్ని పాటించి చక్కటి ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందాలని కోరారు. ప్రిన్సిపల్ నిశాంత్ కృష్ణవా, ఫార్మసిస్ట్ రజిత, స్వప్న మల్లు విజయ, భవాని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

పాల్వంచ: ప్రొఫెసర్ జీఎన్.సాయిబాబా మృతి పట్ల పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేసిన ప్రపంచ మేధావి సాయిబాబా అన్నారు. అతనిపై పలు కేసులను మోపి పదేళ్లు జైల్లో ఉంచడంతో అనారోగ్యానికి గురై మృతి చెందారని, ఇది ప్రభుత్వ హత్య అని విమర్శించారు. ఉద్యమకారులకు ఎంతో అండగా ఉన్నారని, రెండు వందల సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి అనేక సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్లు చెప్పారు. ఆయన మృతి పేద, మధ్యతరగతి, వెనుకబడిన వారికి తీరని లోటన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా కృషి చేయాలన్నారు. ఆయన దివ్యాంగుడు అయినా తన కోసం, తన కుటుంబం కోసం కాకుండా ప్రజల కోసం పాటుపడ్డారని కొనియాడారు.


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సింగు ఉపేందర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గొని నాగేశ్వరరావు, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, వెంకటేశ్వర్లు, టీజేఎస్ జిల్లా కోఆర్డినేటర్ బరగడి దేవదానం, బీసీ సంఘం నాయకులు చిటికెన ముసలయ్య, టీయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంజూరు, శ్రీనివాసరావు, నరసింహారావు, రామచందర్‌రావు, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రికవరీ


ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ సురేష్

టేకులపల్లి: 15 నెలల క్రితం పోయిన మొబైల్‌ను టేకులపల్లి పోలీసులు రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి ఎస్‌ఐ పోగుల సురేష్ తెలిపిన వివరాలు.. టేకులపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన జోగ సునీల్ 15 నెలల క్రితం కిష్టారం నుంచి కొత్తగూడెంకు బైక్‌పై వెళ్తుండగా తన రియల్‌మీ ఫోన్ జారిపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సమాచారం సేకరించి మంగళవారం బాధితుడికి ఫోన్‌ను ఎస్‌ఐ అందజేశారు.

ఇప్పటి వరకు టేకులపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 10 మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం జరిగిందని, ఎవరైనా ఫోన్ పోతే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలని ఎస్‌ఐ తెలిపారు.

మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎజెండాలోని అంశాలైన వివిధ వార్డులలో కోతులను పట్టుటకు విడతల వారిగా బిల్లు రూ.15 లక్షలు 15వ ఫైనాన్స్ నిధుల నుంచి చెల్లించేందుకు, వివిధ వార్డులలో కుక్కలను పట్టి, జంతు జనన నియంత్రణ కేంద్రంలో ఆపరేషన్లు, వ్యాక్సినేషన్ నిర్వహించిన బిల్లు రూ.21 లక్షలు చెల్లించేందుకు కౌన్సిల్ సభ్యులు చర్చలు జరిపి ఆమోదం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, కౌన్సిలర్లు, టౌన్ ప్లానింగ్ అధికారి అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ మేనేజర్ రవిబాబు, ఇన్‌చార్జ్ శానిటరి ఇన్‌స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

మిషనరీ బాప్టిస్ట్ చర్చి ప్రారంభం


ఫాదర్‌ను సన్మానిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంటలో నూతనంగా నిర్మించిన మిషనరీ బాప్టిస్ట్ చర్చిని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభ వేడుకల్లో డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ కులమతాలకు అతీతంగా సాటి మనుషులకు సహాయ పడాలన్నారు. ప్రేమ, కరుణ, తోటి వారిని ప్రేమించడం, పేదలకు, అభాగ్యులకు సహాయ పడాలని యేసు క్రీస్తు చాటిచెప్పారన్నారు. ఈ రోజుల్లో ప్రతీఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరం అన్నారు. దైవ సేవ చేయడం ఒక వరం అన్నారు. కార్యక్రమంలో చర్చ్ ఫాదర్ జి.క్రిస్టఫర్, ఎయింట్స్ గాడ్ గుడ్ మినిస్ట్రీస్ సంస్థ సభ్యులు పాస్ డానిటెన్సనీర్, గ్రామస్తులు ఎన్.నరసింహారావు, ఎస్.కమలాకర్, బి.శ్యాం, ఎస్.ఎర్రయ్య, డి.మాణిక్యరావు, కె.సీతారాములు, కాంగ్రెస్ నాయకులు సాధం రామకృష్ణారావు, వై.వెంకటేశ్వర్లు, చింతా నాగరాజు, కోటి, సుందర్‌రావు, రాములు నాయక్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులతో సమావేశం

జూలూరుపాడు: సీతారామ లింక్ కెనాల్ నిర్మాణంతో భూములు కోల్పోయిన జూలూరుపాడు, వినోభానగర్, పాపకొల్లు గ్రామాలకు చెందిన భూనిర్వాసిత రైతులతో మంగళవారం జూలూరుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య సమావేశం నిర్వహించారు. జూలూరుపాడు – ఏన్కూరు మధ్య నిర్మించే సీతారామ లింక్ కెనాల్‌తో 31 మంది రైతులకు చెందిన 29.14 ఎకరాల భూమి కోల్పోయారు. ఈ సందర్భంగా కాశయ్య మాట్లాడుతూ... భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.13.50 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. దీనికి రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ రూ.20 లక్షలు చెల్లిస్తామని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారని, ఇప్పుడు తక్కువ ఇస్తామనడం సరైంది కాదని, రూ.25 లక్షలు చెల్లిస్తేనే అగ్రిమెంట్‌పై సంతకాలు చేస్తామని భీష్మించారు. మంత్రిని కలిసిన తరువాత మాట్లాడతామని చెప్పడంతో అధికారులు సమావేశాన్ని ముగించి వెళ్లిపోయారు. ఎస్‌డీసీ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబు, కొత్తగూడెం ఇరిగేషన్ డీఈ చంద్రశేఖర్, జేఈ సాగర్, జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, గిర్దావర్ తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.


నష్టపరిహారం పెంచాలని కోరుతున్న రైతులు

నష్టపరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యేకు రైతుల వినతి..
సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ భూములకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ అన్నారుపాడు గ్రామానికి చెందిన రైతులు మంగళవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను కొత్తగూడెంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ.. ఎలుకలొడ్డు గ్రామ సమీపంలోని పోడు భూములను 20 ఏళ్లుగా సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నామన్నారు. అట్టి పోడు భూములు సీతారామ కెనాల్ కింద కోల్పోవడం జరిగిందని, ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వలేదని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసినా మాగోడు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, బాదావత్ జవహర్‌లాల్, భూక్యా లోక్యా తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు